

నేడు యథావిధిగా స్పందన

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం - స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

ముంచెత్తిన వాన



- పొంగిపొర్లిన వాగులు, వంకలు
- వాగులో చిక్కుకున్న ఆర్‌టిసి బస్సు
- గుండ్లకుంట గ్రామాన్ని ముంచెత్తిన వరద
- భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఓబులాపురం గ్రామ సమీపంలో బురదలో చిక్కుకున్న లారీలు
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- వేంపల్లెలో జలమయమైన వీధులు

వారం రోజులుగా వర్షాలు లేక, ఎండవేడిమి తాళలేక, ఉక్కపోతతో అల్లాడిన జనానికి శనివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణంతో కాస్త ఊరట లభించింది. మరోవైపు భారీ వర్షానికి జమ్మలమడుగు ప్రాంతంలో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఈ క్రమంలోనే వాగులో ఆర్‌టిసి బస్సు చిక్కుకుంది. ఆ సమయంలో పోలీసులు వెంటన స్పందించడంతో ప్రయాణికులకు ప్రాణాపాయం తప్పింది. పెద్దముడియం మండలంలోని గుంట్ల గ్రామాన్ని వరదనీరు ముంచెత్తింది. మోకాళ్లలోతు వరకు నీరు రాడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరో వైపు ఓబుళాపురం గ్రామ సమీపంలోని బ్రిడ్జి వద్ద బురదలో లారీలు చిక్కుకోడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వేంపల్లె మండల కేంద్రంలోని వీధులన్నీ జలమయమయ్యాయి.

- ప్రజాశక్తి-యంత్రాంగం

జమ్మలమడుగు : నియోజకవర్గంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. జమ్మలమడుగు మండలం ఎస్. ఉప్పలపాడు గ్రామ సమీపంలో ఇసుక వాగు పొర్లడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. ఇసుక వంక వాగులో కర్నూలు నుంచి ప్రొద్దుటూరుకు వస్తున్న ఆర్టీసీ బస్సు (ఏపీ 04 జెడ్ 0156) వంకలో చిక్కు కుపోయింది. విషయం తెలుసుకున్న జమ్మల మడుగు అర్బన్ సిఐ సదాశివయ్య తన సిబ్బందితో కలిసి రెస్క్యూ ఆపరేషన్ నిర్వ హించారు. ఇందులో డ్రైవర్, కండక్టర్‌తోపాటు 13 మంది ప్రయాణికులను సురక్షితంగా కాపాడారు. బస్సులో ఉన్న ప్రయాణికులందరిని సురక్షితంగా బయటకు తీసుకురావడంతో సిఐ సదాశివయ్యను, పోలీస్ సిబ్బందిని ప్రజల తోపాటు ఎస్‌పి అన్బురాజన్ అభినం దించారు మరో వైపు పెద్దముడియం మండలంలోని గుండ్లకుంట గ్రామాన్ని భారీ వర్షానికి వరద నీరు చుట్టు ముట్టింది. శనివారం రాత్రి గ్రామంలో దాదాపు 16 సెంటీమీటర్ల మేర వర్షం కురిసింది. వర్షం ధాటికి వరద నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మోకాళ్ళ లోతు వరకు వరద నీరు ప్రవాహం ప్రవహిస్తుండడంతో ప్రజలు జీవనానికి, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. గ్రామంలోని లోతట్టు ప్రాంతాలలోని గహాల్లోకి నీరు చేరాయి. సమాచారం అందిన వెంటనే ఎమ్మెల్సీ పొన్నపు రెడ్డి రామసుబ్బారెడ్డి ట్రాక్టర్‌లో గ్రామాన్ని పరిశీలించి సంబంధిత అధికారులతో సహాయక చర్యలపై చర్చించారు. భారీ వర్షానికి ఇబ్బందులు పడుతున్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు జమ్మలమడుగు పట్టణంలోని పలు ప్రాంతాలు భారీ వర్షానికి జలమయమై చెరువులను తలపిస్తున్నాయి. ఆర్టీసీ బస్టాండ్, డిఎస్‌పి బంగ్లా, ఎంపిడిఒ కార్యాలయం ఆవరణ తదితర ప్రాంతాలేగాక పలు కాలనీలలో వర్షపు నీరు చేరి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ప్రయాణికులను రక్షిస్తున్న పోలీసులు



గుండ్లకుంట గ్రామంలోకి చేరిన వరద నీరు

పెద్దముడియం : మండలంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు వరదలతో పోటెత్తాయి. వంకలు నిండి గ్రామా ల్లోని వీధుల గుండా వరద నీరు సెలయేర్లులా పారి ఊర్ల న్నీ జలమ యమయ్యాయి. మండలంలోని చాలా గ్రామాలకు రాకపోకలు గ్రామాల నిలిచిపోయాయి. గుండ్లకుంట గ్రామంలో వరద తీవ్ర రూపం దాల్చడంతో ఇళ్లల్లోకి నీరు చేరింది. ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి అలాగే మాజీ ఎంపీపీ గిరిధర్ రెడ్డి తమ కార్యకర్తలతో వరద నీరు చేరిన వీదుల్లో తిరుగుతూ సహాయ చర్యల్లో పాల్గొని తక్షణమే అధికారులకు అప్రమత్తం చేసి ప్రజలకు కనీస సౌకర్యాలకు వెంటనే కల్పించాలని తెలిపారు. గుండ్లకుంట ఉప్పలపాడు మధ్య ఉధృతంగా ప్రవహించే తీగలేరు వరద ఉధృతి తగ్గకపోవడంతో జమ్మలమడుగు నుంచి పెద్దముడియం మండల గ్రామాల వైపు వెళ్ళే ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నెమళ్లదిన్నె గ్రామం వద్ద కుందూ నది ఉధృతంగా వంతెనపైన ప్రవహిస్తునడంతో నదీ ప్రాంతం వైపు ఎవరూ వెళ్లకూడదని మండల ప్రజలకు తెలియజేస్తూ ఎస్ఐ రామకృష్ణ తమ సిబ్బందిని వంతెన వద్ద కాపలాగా నియమించారు. అదేవిధంగా పల్లెల్లోని పాత మిద్దెలలో నివాసం ఉంటున్న వారు వర్షాకాలం జాగ్రత్తగా ఉండాలని ఉండాలని భారీ వర్షాల వలన కాలం చెల్లిన మిద్దెలు కూలే ప్రమాదం ఉంది కాబట్టి ఎంతో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచించారు.



గుండ్లకుంట గ్రామంలో పర్యటిస్తున్న రామసుబ్బారెడ్డి

ముద్దనూరు : మండలంలో శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. వేసవి తలపిస్తూ మండుతున్న ఎండల ధాటికి వేడిని తట్టుకోలేక ప్రజలు ఉక్కపోతతో అల్లాడారు. వర్షం కురవడంతో చల్లని వాతావరణం నెలకొంది. తాడిపత్రి రహదారిలోని ఓబుళాపురం గ్రామం సమీపంలో ఉన్న బ్రిడ్జి వద్ద రెండు వైపులా లారీలు ఇరుక్కుపోయి. బ్రిడ్జి వద్ద మరమ్మతులు జరుగుతుండటంతో బురదలో ఇరుక్కున్నాయి. ప్రధాన రహదారి కావడంతో లారీలు, బస్సులు, కార్లు నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



బ్రిడ్జి వద్ద స్తంభించిన రాకపోకలు

వేంపల్లె : శనివారం రాత్రి ఒక్క సారిగా కురిసిన కుండపోత వర్షానికి వీధులన్నీ జలమ యమయ్యాయి. స్థానిక గండి రోడ్డులో ఉన్న వైఎస్ఆర్ గెస్ట్ హౌస్ వెనుక వీధిలో మోకాళ్ల లోతు వరకు వర్షపు నీరు ప్రవహించడంతో వీధిలో ఉన్న ఇళ్లల్లోకి మురుగు నీరు చేరాయి. బియ్యంతో పాటు ఇతర వస్తువులు తడిసి పోయినట్లు అ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. కొనేళ్ల నుంచి ఇలాంటి సమస్య ఉందని, అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోవడం లేదని వాపోయారు. చిన్నపాటి వర్షం కురిసినా వైఎస్ఆర్ గెస్ట్ హౌస్ వెనుక వీధి మాత్రం చెరువులాగ వీధి అంతా నీటితో నిండి పోతుంది. మురుగునీరు ఎండి పోయినంత వరకు పెద్దలు, పిల్లలు, మహిళలు బయటికి రావాలంటే జంకుతుంటారు. పోలవరం ముంపు ప్రాంతంగా ఉండడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు కింద భాగం వర్షపు నీరు అంతా వీధుల్లోకే వెళ్తోందని చెప్పారు. ఇంట్లోకి వర్షపు నీరు చేరడంతో రాత్రి జాగారం చేయాల్సిన పరిస్థితి వచ్చిందని ప్రజలు వాపోయారు. దోమలు కూడ విపరీతంగా పెరిగి పోవడంతో ఆనారోగ్యానికి గురై ఆస్పత్రులకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ కాలువల్లోని విష కిటకాలు కూడ వర్షపు నీటిలో ఇంట్లోకి వస్తున్నట్లు చెప్పారు. విష పురుగులతో భయాందోళనకు గురి అవుతున్నట్లు చెప్పారు. తమ కష్టాలను తొలగించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకొని రోడ్డును ఎత్తు పెంచాలని ప్రజలు కోరుతున్నారు.



వేంపల్లె వీధిలోకి చేరిన వర్షపు నీరు

ఆర్‌టిసి ప్రయాణమే సురక్షితం

జిల్లా ప్రజా రవాణా అధికారి పి.రాము

ప్రజాశక్తి - రాయచోటి

ఆర్‌టిసి ప్రయాణమే సురక్షితమని జిల్లా ప్రజా రవాణా జిల్లా అధికారి పి.రాము పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాలో డిపోలు, బస్సుల వివరాలు, అదనపు బస్సుల మంజూరు, ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణం సురక్షితం కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.. అలాగే ఆర్‌టసి ప్రజలకు ఏ విధంగా సేవలు అందిస్తోందో.. ఆర్‌టిసిని ఎలా లాభాల బాటలో నడిపించాలో ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన వివరించారు.



ముఖా ముఖి..

అన్నమయ్య జిల్లాలో డిపోలు, బస్సు ల వివరాలు తెలపండి?

అన్నమయ్య జిల్లా పరిధిలో ఐదు డిపోలు మన పరిధిలోకి వస్తాయి. మదనపల్లె - 1,2, పీలేరు, రాజంపేట, రాయచోటి డిపోలలో డిఎంలుంటారు. జిల్లాలో 509 బస్సులున్నాయి. 365 కార్పొరేషన్, 144 ఎయిర్ బస్సులు ఉన్నాయి.

జిల్లాకు ఏమైనా కొత్త బస్సులు వచ్చాయా?

మదనపల్లె డిపోలో స్టార్ లైనర్(నానేసి స్లీపర్), పీలేరు డిపోలో చెన్నై సప్తగిరి ఎక్స్‌ప్రెస్, మదనపల్లె నుంచి తిరుపతికి 12 ఏసీ ఎలక్ట్రికల్ బస్సులు వచ్చాయి.

జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలకు బస్సులు ఏర్పాటు చేశారా?

మదనపల్లె నుండి చెన్నై, బెంగళూరు, హైదరాబాదు ,రాయచోటి నుండి బెంగళూరు, చెన్నై హైదరాబాద్ ప్రస్తుతం వెళుతున్నాయి. ఇంకా వేలూరుతోపాటు పలు ప్రాంతాలకు ఆర్‌టిసి బస్సు నడపడానికి ప్రతిపాదనలను పంపడం జరిగింది.

ప్రమాదాలు అరికట్టడానికి డ్రైవర్లకు ఏమైనా శిక్షణ ఇస్తున్నారా?

జిల్లా వ్యాప్తంగా ప్రమాదాలను అరికట్టడం కోసం రాష్ట్ర కార్యాలయం నుంచి ట్రైనర్‌తో గత నెలలో రెండు వారాలు డ్రైవ ర్లకు, జిల్లా డ్రైవర్లకు శిక్షణ తరగతులు నిర్వహించాం. అలాగే రవా ణా శాఖ వారి ఆధ్వర్యంలో కూడా పలు అవగాహన కార్యక్రమాలు చేపట్టి ప్రమాదాలుపై డ్రైవర్లకు పలు సూచన సలహాలను అందజేస్తున్నాం. ప్రతి మంగళవారాలు డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నాం.

జిల్లా కేంద్రంలో ప్రయాణికులకు ఇలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు?

జిల్లా కేంద్రమైన రాయచోటి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రస్తుతం 9 ప్లాట్ ఫామ్‌లున్నాయి. రూ.2.50 కోట్ల నిధులతో 5 ప్లాట్ ఫామ్‌లను పెంచుతున్నాం. మరుగుదొడ్ల పనులు చేపడుతున్నాం. డ్రైవర్లు, కండక్టర్ల కోసం విశ్రాంతి రూములను ఏర్పాటు చేస్తున్నాం. ఈ నిధులతో నూతన హంగులతో విస్తరణ పనులు పూర్తి చేశాం. ఈ నెల చివరినాటికి బస్టాండ్‌ను ప్రారంభిస్తాం.

ఆదాయం కోసం ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఆర్‌టిసి ఆదాయం కోసం ప్రతి డిపోలో వారానికి ఒకసారి సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నాం. జిల్లా కేంద్రంలో ఆర్‌టిసి బస్టాండ్ నూతన ఫ్లాట్‌ఫామ్‌పాటు కాంప్లెక్స్‌లు కూడా నిర్వహిస్తున్నాం. ఆర్‌టిసి ఆదాయాన్ని జోన్లలో నంబర్‌వన్‌గా ఉండడానికి మరింత ప్రయత్నం చేస్తున్నాం.

ప్రయాణికులకు ఎలాంటి సూచనలు, సలహాలిస్తారు?

ఈ మధ్యకాలంలో ద్విచక్ర, ఆటోలో ఎక్కువ మంది వెళ్తున్నారు. ద్విచక్ర వాహనంలో ముగ్గురు వెళ్లకూడదు .అలాగే ఆటోల్లో కూడా 4,5 మంది కంటే ఎక్కువ మంది వెళ్లకూడదు. ద్విచక్ర వాహనదారులు 30 కిలోమీటర్లు దూరం మించి వెళ్లకూడదు. ద్విచక్ర, ఆటలో అధిక స్పీడు వెళ్లడం వల్ల అనేక ప్రమాదం జరుగుతున్నాయి. మలుపు వద్ద ,రోడ్డు దాటుతున్నప్పుడు నెమ్మదిగా వెళ్ళాలి. ప్రయాణానికి ఆర్‌టిసి బసే ప్రయాణికులకు సురక్షితం.

ఓట్ల తొలగింపులో అప్రమత్తంగా ఉండాలి

- ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ గోపాలకృష్ణ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఓట్ల తొలగింపులో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, పునఃపరిశీలన చేయాలని ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ గోపాలకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలోని ఎన్‌టిఆర్ కాలనీలో తహశీల్దార్ ఫిరోజ్ ఖాన్‌తో కలసి పర్యటించి, ఓటర్లతో మాట్లాడారు. ఓటర్ల జాబితా నుంచి మృతులు, శాశ్వత వలసలు వెళ్లిన ఓటర్లను తొలగించే సమయంలో క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని పేర్కొన్నారు. సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా రూపొందించే ప్రక్రియలో అధికారులు జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను విధిగా పాటించాలని, ఇతర కారణాలతో తొలగింపు జాబితాలోని గృహాలను కూడా పరిశీలించాలని ఆదేశించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఎంతకాలం కిందట మృతి చెందారు, కారణాలు, శాశ్వతంగా వలసలు వెళ్లిన ఓటర్ల జాబితా తొలగింపు కోసం దరఖాస్తు చేసిన వారిని విచారించాలని పేర్కొన్నారు. సంబంధిత దస్త్రాలను పరిశీలించాలని, అక్కడ నమోదైన ఓటర్లు, ఓటు హక్కు పొందిన కాలం, శాశ్వత వలసలు వెళ్లిన కారణాలను క్షుణ్ణంగా విచారణ జరపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ సుధాకర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఓటర్ల పరిశీలనలో సిబ్బందికి సూచనలిస్తున్న డిప్యూటీ కలెక్టర్

సేవా కార్యక్రమాలు మరింత విస్తృతం



బస్‌షెల్టర్‌ను ప్రారంభిస్తున్న వాసవి క్లబ్ సభ్యులు, వైసిపి నాయకులు


ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సేవా కార్యక్రమాలను దేశ వ్యాప్తంగా విస్తృత పరచడంలో వాసవి క్లబ్ మరింత ముందుకెళ్లాలని ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ అధ్యక్షురాలు పాలకుర్తి గాయత్రి, అధ్యక్షులు నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. ఆదివారం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మదనపల్లె మండలం వలసపల్లి వద్ద ప్రయాణికుల సౌకర్యార్థం రూ. 3 లక్షల వ్యయంతో నిర్మించిన బస్ షెల్టర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ వైసిపి నాయకులు నాగరాజరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాసవి క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. నిరుపేద విద్యార్థులు విద్యాభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయడమే లక్ష్యంగా పని చేస్తామని స్పష్టం చేశారు. ముఖ్య అతిథి గువ్వల నాగరాజ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా వాసవి క్లబ్ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సరికొత్త చరిత్ర సృష్టిస్తోందని కొనియాడారు. కార్యక్రమంలో సెక్రటరీ ఆశోక్ కుమార్, ట్రజరర్ లక్ష్మీపతి, డిస్ట్రిక్ట్ గవర్నర్ వి211ఎ వెంకటేష్ బాబు, ఐసి ఆఫీసర్స్ ఆర్.బాలాజీ, కె.ఎస్.క్రిష్ణమూర్తి, కేబినెట్ సెక్రటరీ ప్రభాకర్ రావు, ఎ.వి.శివ ప్రసాద్, వనిత క్లబ్ ప్రెసిడెంట్ క్రాంతి రేఖ, ట్రెజరర్ జయశ్రీ, బస్ షెల్టర్ ఇన్‌ఛార్జ్ మునిరాజ్, వినయ కుమార్, మాజీ అధ్యక్షులు బాలాజీ పాల్గొన్నారు.

జెవివి జిల్లా అధ్యక్షులుగా ప్రభుచరణ్

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అన్నమయ్య జిల్లా అధ్యక్షులుగా వాల్మీకిపురానికి చెందిన ప్రభుచరణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం రాయచోటి పట్టణంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కమిటీలో వాల్మీకిపురానికి చెందిన ప్రభుచరణ్ జిల్లా అధ్యక్షులుగా, రాయచోటికి చెందిన ప్రకాష్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. నూతన జిల్లా అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ సమాజంలో పేరుకుపోయిన మూఢ నమ్మకాలను పారద్రోలి ప్రజల్లో సైన్సు పట్ల అవగాహన కల్పించేందుకు జనవిజ్ఞాన వేదిక కృషి చేస్తోందన్నారు. జిల్లాలో జనవిజ్ఞాన వేదిక బలోపేతానికి పలు కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు.



ఉర్దూ డిఐ పోస్టులు వెంటనే భర్తీ చేయాలి : రూట

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉర్దూ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ (ఉర్దూడిఐ) పోస్టులను వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్, రాష్ట్ర సమన్వయకర్త ముహమ్మద్ అయ్యూబ్,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు ముహమ్మద్ అలీ లు డిమాండ్ చేశారు. ఆదివారం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సబాతుర్ రెహమాన్ ఆధ్వర్యంలో రూట ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందల సంఖ్యలో ఎంఇఒ పోస్టులు భర్తీ చేసిన రాష్ట్ర విద్యాశాఖ ఉర్దూ డిఐ పోస్టులు భర్తీని విస్మరించడం శోచనియమని, రాష్ట్ర రెండో అధికార భాష అయిన ఉర్దూకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలోని పాత జిల్లాల్లో ఉర్దూ డిఐ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, అదే విధంగా కొత్తగా ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్, అన్నమయ్య, శ్రీసత్యసాయి, నంద్యాల, పల్నాడు, తిరుపతి, కోనసీమ జిల్లాలకు ఉర్దూ డీఐ పోస్టులు మంజూరు చేసి భర్తీ చేయాలని, ఈ జిల్లాల్లో ఉర్దూ మీడియం పాఠశాలలు అత్యధికసంఖ్యలో ఉన్న కారణంగా ఉర్దూ డిఐ పోస్టులు అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి అసదుల్లా, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జాఫరుద్దీన్, రాష్ట్ర కార్యదర్శి హుమాయుద్దీన్ , జిల్లా బాధ్యులు ముహిబుల్లా, నాయకులు అంజద్ బాషా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రూట నాయకులు

'అమృత' ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు పట్టణంలో కొత్తగా ప్రారంభించిన 'అమృత' చిన్నపిల్లలు, జనరల్ ఆసుపత్రిలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం స్థానిక ఎస్‌వి డీలక్స్ రోడ్డులోని ఆసుపత్రిలో వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో సుమారు 100 మందికి వివిధ రోగాలకు చికిత్సలు అందించారు. ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ ఎల్. కిరణ్ కుమార్ రెడ్డి, నరాల వైద్య నిపుణులు డాక్టర్ ఏ. సౌమ్యా రెడ్డి మాట్లాడుతూ చిన్నపిల్లల్లో జన్మతః వచ్చే పచ్చ కామెర్లకు ఫొటోథెరపీ, ఇంక్యుబేటర్ సదుపాయం, నైబ్యూ లైజర్, సిపిఏపి సదుపాయం, చిన్నపిల్లలు, సాధారణ వైద్యాన్ని అందించేందుకు వీలుగా తమ అమృత ఆసుపత్రిలో అధునాతన వైద్య పరికరాలను ఏర్పాటు చేశారన్నారు. పిల్లలు, పెద్దలకు అన్ని రకాల వైద్య పరీక్షల నిర్వహణ కోసం అవసరమైన సౌకర్యాలను కూడా సమకూర్చామని చెప్పారు. ఐసియు, ఎక్సరే, ఈసీజీ, పిడియాట్రిక్ అండ్ అడల్ట్ స్పెషల్ రూమ్స్, సెంట్రల్ ఆక్సిజన్, నెబులైజేషన్, వెంటిలేటర్ సౌకర్యం ఉందని వైద్యులు తెలిపారు. ప్రతి నెలా మొదటి ఆదివారం నరాలు, హృద్రోగ సమస్యలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. బరువుపెరగక పోవడం, ఎదుగుదల లేకపోవడం వంటి న్యూట్రీషియన్ సంబంధిత వ్యాధులు, పిల్లల్లో కలుగు చర్మసంబంధిత వ్యాధులు, రక్తహీనత, కాలిన, తెగిన గాయాలకు ప్రత్యేకంగా చికిత్స అందిస్తామని అన్నారు. గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, మూర్ఛ, పాముకాటు, పాయిజన్ కేసులు, జ్వరం, జలుబు, దగ్గు, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్, వాటన్నిటికి చికిత్స అందిస్తామన్నారు. అన్నిరకాలటీకాలు, వ్యాక్సినేషన్, మలేరియ, టైఫాయిడ్, డెంగ్యూ లాంటి వ్యాధులకు కూడా చికిత్స అందిస్తామని అన్నారు. ఈ వైద్య శిబిరంలో వైద్యులు డాక్టర్ రామాంజనేయ నాయక్, డాక్టర్ కళ్యాణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు సౌమ్యారెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి

మానసిక నిపుణుల పాత్ర కీలకం

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజల ఆరోగ్యకర జీవన విధానంలో మానసిక నిపుణులు క్రియాశీలకమైన పాత్రను పోషించాలని విజయవాడ ప్రముఖ సైక్రియాటిస్ట్ ఇండ్ల రామసుబ్బారెడ్డి అన్నారు. వైవీయూ మనో విజ్ఞాన శాఖ, అడ్వాన్స్‌డ్ సైకలాజికల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కలసి ' ఆత్మహత్యల నివారణలో మానసిక నిపుణులు' అనే అంశంపై కార్యశాల, శిక్షణ రెండో రోజు కొనసాగింది. కార్యశాల కన్వీనర్ మనో విజ్ఞాన శాస్త్ర శాఖ సహ ఆచార్యులు డా.కె. లలిత, కో కన్వీనర్ డాక్టర్ వి. లాజర్ అధ్యక్షత వహించగా విజయవాడ ప్రముఖ సైక్రియాటిస్ట్ ఇండ్ల రామసుబ్బారెడ్డి ఆన్‌లైన్‌లో మాట్లాడారు. పిల్లలను జీవితంలో ఎదురయ్యే ఎత్తు పల్లాలను సమానంగా స్వీకరించేలా తల్లిదండ్రులు అలవాటు చేయాలన్నారు. పిల్లలకి ఇష్టమైన రంగాన్ని గుర్తించి అందులోనే రాణించేలా తర్ఫీదు ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో విజయవాడ క్లినికల్ సైకాలజిస్ట్ ఝాన్సీ రాణి, క్లినికల్ సైకాలజిస్ట్ శివగంగా, సమగ్ర శిక్ష అభియాన్ పిఒ ఎ. ప్రభాకర్‌రెడ్డి, కన్వీనర్లు డాక్టర్ లలిత, డాక్టర్ లాజర్, విద్యార్థులు పరిశోధకులు పాల్గొన్నారు.

18 మంది కంటి రోగులకు ఆపరేషన్లు

రాయచోటి : మండల పరిధిలోని చెన్నముక్కపల్లె లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో 18 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజవర్గంతో పాటు జిల్లా పరిధిలోని రాజంపేట, రైల్వే కోడూరు, యర్రావారిపాలెం, కె.వి. పల్లి, కలకడ, కలికిరి, పెద్ద మండెం, గుర్రంకొండ, కదిరి, ఎన్.పి.కుంట, చక్రాయపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 50 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన వైద్యులు అందులో అర్హులైన 18 మందికి ఆపరేషన్లు చేశారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 35 మంది కంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కంటి ఆపరేషన్ కోసం వచ్చిన రోగులతో పాటు వారి వెంట ఉండే వారికి భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ చెన్నూరు అన్వర్ బాషా, ఎంపిటిసి రామచంద్రారెడ్డి, లయన్ రెడ్డప్పరెడ్డి, కంటి వైద్యులు సురేష్ బాబు, భార్గవి, ఆప్తాలిక్ అసిస్టెంట్ మూలీ రాజగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

కడప : కడప నగరం 48 డివిజన్ కృపా కాలనీలో తల్లి దండ్రులు ఉన్నా వారి ప్రేమను కోల్పోయిన చిన్నారి పి.రోజా పుట్టిన రోజు సందర్భంగా ముందస్తుగా డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా చేతుల మీదుగా న్యూ నేటివ్ కృపా ప్రార్థన మందిరంలో పాస్టర్ పి. మహేష్, సిస్టర్ శాంతమ్మ ఆధ్వర్యంలో ఆదివారం కేక్ కట్ చేసి, పేదలకు అన్నదానంతో పాటు వస్త్రాలు, విద్యార్థులకు పండ్లు, పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పి.రవితేజ, నరసయ్య, దావీదు, సరళ, భారతి, ఎస్తెరమ్మ, ఏ.అగస్టిన్, శాంతిరాజు, రోజా, లీలావతి అనేక మంది భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా రాయలసీమ కింగ్స్ విజయోత్సవం

కడప : ఇటీవల ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన (ఆంధ్ర ప్రీమియర్ లీగ్) ఎపిఎల్ సీజన్ -2 క్రికెట్ టోర్నీలో రాయలసీమ కింగ్స్ జట్టు విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా కడప జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాయలసీమ కింగ్స్ విజయోత్సవ కలయిక కార్యక్రమాన్ని కడపలోని వై.ఎస్.రాజారెడ్డి ఏసీఏ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. రాయలసీమ కింగ్స్ జట్టు రథసారథి హనుమ విహారి, జట్టు సభ్యులకు జిల్లా క్రికెట్ అసోసియేషన్ తరపున క్రికెట్ క్రీడాకారులు, అసోసియేషన్ సభ్యులు, ఏ సి ఏ సౌత్ జోన్ అకాడమీ పరిపాలన అధికారి ఏ. శ్రీనివాసులు, రాయలసీమ కింగ్స్ జట్టుకు చెందిన క్రీడాకారులకు అతిథులు జ్ఞాపికలు అందజేసి అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఈ సందర్భంగా ఏసీఏ సౌత్ జోన్ అకాడమీ ఛైర్మన్ కె.వి. పురుషోత్తం రావు, ఎసిఎ సంవత్సరం అకాడమీ కన్వీనర్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఏ. రెడ్డి ప్రసాద్, రాయలసీమ కింగ్స్ జట్టు ఫ్రాంచైజీ సీఈవో నాగభూషణ రెడ్డి సహాయక సిబ్బంది పాల్గొన్నారు.


విశ్రాంత ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్రరెడ్డి

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజాశక్తి-కలికిరి

సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేద్దామని ప్రధాన కార్యదర్శి సురేంద్రరెడ్డి పిలుపు నిచ్చారు. ఆదివారం స్థానిక షాదీ మహల్లో విశ్రాంత ఉద్యోగుల సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు తప్పనిసరిగా ఇకెవైసి చేసుకోవాలని, ఇన్కమ్ టాక్స్ అప్డేట్ చేసుకోవాలని, కాకినాడలో జరగబోయే సమావేశానికి అందరూ హాజరు కావాలని తెలిపారు. సమస్యల పట్ల అందరూ కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాగప్ప, సత్య నారాయణరావు, రామ చంద్రయ్య, కృష్ణారెడ్డి, వెంకట్, నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ బస్సుయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -బి.కొత్తకోట

రాష్ట్రాన్ని రక్షించుకుందాం-దేశాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో సిపిఐ ఆధ్వర్యంలో ఆగస్టు నెల 17వ తేదీన విశాఖపట్నం నుంచి ప్రారంభమైన బస్సు యాత్ర, రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో పర్యటించి,సెప్టెంబర్ 6న మదనపల్లెకు చేరుకోనుంటున్న సందర్భంగా భారీ బహిరంగ సభ నిర్వహిస్తు న్నామని సిపిఐ తంబళ్లపల్లె నియోజకవర్గపు కార్యదర్శి యస్.మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆది వారం స్థానిక పిటియం రోడ్ నందు బస్సు యాత్రకు సంబంధించిన గోడప్రతుల ఆవిష్కరించారు. .ఈ సందర్భంగా ఎస్.మనోహర్ రెడ్డి,సీనియర్ నాయకులు యస్.బషీర్ ఖాన్ లు మాట్లాడుతూ రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం, కేంద్రంలోని బిజెపి సారధ్యంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వాలు రెండూ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను రాష్ట్ర ప్రజానీకానికి తెలిపి వారిని చైతన్య పరచాలనే సదుద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర చేపట్టి నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎం.అష్రఫ్‌అలీ, హెచ్.షమీవుల్లా, జి.రఘు నాథ్, గంగులప్ప, మోదీన్‌సాబ్, బావాజాన్, ఖాదర్‌బాషా, కిట్టన్న పాల్గొన్నారు.


ఉపాధ్యాయుడు వినయ్‌తేజను సన్మానిస్తున్న ఆర్గనైజేషన్ సభ్యులు


రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన వినయ్‌తేజ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని భారత్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ సోషియల్ స్టడీస్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న జె.వినయ్‌తేజ రాష్ట్రస్థాయి ఉపాధ్యాయుల అవార్డుకు ఎంపికయ్యాడు.ఆదివారం ప్రయివేట్ ఉపాధ్యాయుల ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గుంటూరు పసీ కళాశాల అసెంబ్లీ హాల్ ఆవరణంలో ఘనంగా రాష్ట్రస్థాయి ఉపాధ్యాయుల అవార్డుల ఉత్సవం జరిగింది. రాష్ట్రస్థాయి ఉపా ధ్యాయ అవార్డుకు ఎంపికైన జె.వినయ్‌తేజను ఎంఇఒలు రెడ్డిశేఖర్, భీమే శ్వరరావు, పాధ్యాయులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

జామియా మసీదు అధ్యక్షులుగా అబ్దుల్‌ముజీబ్

ప్రజాశక్తి-రైల్వేకోడూరు


అబ్దుల్‌ముజీబ్

పట్టణంలోని జామియా మసీదు నూతన అధ్యక్షులుగా రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ హాజీ అబ్దుల్‌ముజీబ్‌ను నియమించినట్లు మత పెద్దలు పేర్కొన్నారు. మత పెద్దలు సమావేశం నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారని అధ్యక్షులుగా అబ్దుల్‌ముజీబ్, కార్యదర్శిగా హాజీ సాదిక్‌బాషా, ఉపాధ్యక్షులుగా తయుబ్, జాయింట్ సెక్రటరీగా నజీర్, కోశాధికారిగా అబ్దుల్ రవూఫ్‌ను నియమించినట్లు మత పెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు ముజీబ్ మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న నూతన జామియా మసీదు పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు తన వంతుకృషి చేస్తానని, అందరి సహకారం అవసరమని అన్నారు.


నరాల పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఉచిత వైద్య పరీక్షలకు విశేష స్పందన


ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ అరవపల్లె ఆర్ఎస్ రోడ్ లోని దీప్తి నర్సింగ్‌హోమ్‌లో ఆదివారం వందమందికి నరములకు సంబంధించిన ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ జయకృష్ణసురావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధునాతన పరికరములతో, అనుభవం పొందిన టెక్నీషియన్లతో ఈ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మందుల కంపెనీ మ్యాన్ కైండ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ పరీక్షలలో మ్యాన్ కైండ్ రిప్రజెంటేటివ్ రామచంద్ర, టెక్నీషియన్ దినేష్‌లు పాల్గొన్నారు.

ఫ్యూచర్ మైండ్స్ స్కూల్ ఉపాధ్యాయుడికి అవార్డు

ప్రజాశక్తి - రాజంపేట

కడప నగరంలోని జడ్‌పి హాల్లో అప్సా ఆధ్వర్యంలో ప్రయివేట్ పాఠశాలల ఉపాధ్యా యులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రదానం చేశారు. రాజంపేట పట్టణంలోని ఫ్యూచర్ మైండ్స్ స్కూల్ సైన్స్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ఇ.సుజిత ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి, కడప నగర మేయర్ సురేష్ బాబు, డిఇఒ రాఘవరెడ్డి చేతుల మీదుగా అందు కున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ నందకిషోర్ మాట్లాడుతూ ప్రయివేట్ స్కూల్ పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందించడం సంతోషం కలిగించే విషయమన్నారు. ఇటువంటి అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు మరింత బాధ్యతగా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతారని అభిప్రాయపడ్డారు. ఇటువంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన అప్సా జిల్లా, రాష్ట్ర నాయకులకు ధన్యవాదములు తెలిపారు.


సుజితను సన్మానిస్తున్న జడ్పిచైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి

ఇ- క్రాప్‌లో పంట నమోదు చేసుకోండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

వివిధ రకాల పంటలు సాగుచేసిన రైతులందరూ తమ పంట సాగు వివరాలను ఇ-క్రాప్ లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్ తెలిపారు. 2023 ఆర్థిక సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ, ఉద్యానవన పంటలు మండల పరిధిలో 4173 ఎకరాల్లో సాగు చేయడం జరిగిందన్నారు. మండలంలోని 12 సచివాల యాల పరిధిలోని రైతు భరోసా కేంద్రల ద్వారా 50శాతానికి పైగా ఇప్పటికే ఇ-క్రాప్‌లో రైతులు సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేశామ న్నారు. రైతులందరూ తమ పంట వివరాలు తప్పనిసరిగా ఇ-క్రాప్‌లో నమోదు చేయించుకో వాలన్నారు. ఇ-క్రాప్ ఆధారంగానే ప్రభుత్వం పంట నష్టం, పంట బీమా సాయం అందించడంతోపాటు పంట దిగుబడులు మద్దతు ధరకు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతులు తమ పరిధిలోని ఆర్‌బికె కేంద్రాలలో వివరాలు తెలపాలని కోరారు.


పంట నమోదు వివరాలను నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

ఎడతెరిపిలేని వర్షం.. పొలాలు పదును


పొలాల్లో చేరిన వర్షపు నీరు

ప్రజాశక్తి - చాపాడు

శనివారం సాయంత్రం నుంచి ఆదివారం ఉదయం వరకు ఎడతెరిపిలేని అధిక వర్షంతో వ్యవసాయ భూములు పూర్తిగా పదునెక్కాయి. పంట పొలాలలో ఎక్కడ చూసినా వర్షపు నీటితో దర్శనమిస్తున్నాయి. మండల పరిధిలోని కేతవరం నుంచి ప్రొద్దుటూరు వైపు గ్రామాలలో మాత్రమే మోస్తారు వర్షం నమోదైంది. రాత్రి తిరిగి మండల వ్యాప్తంగా పూర్తి స్థాయిలో వర్షం నమోదైంది .ఈ ఖరీఫ్ సీజన్‌లో శనివారం రాత్రి కురిసిన వర్షం అధికం అని చర్చించుకుంటున్నారు. మండల వ్యాప్తంగా 92.2మిమి వర్షపాతం నమోదైంది. వారం రోజులుగా ఎండ తీవ్రత అధికమై విద్యుత్ కోతలు మొదలు కావడంతో ప్రజలు నానా అవస్థలు పడేవారు. వరి పంటను సాగు చేసే రైతులు విద్యుత్ సరఫరాలో అంత రాయం కలుగుతుండడం, బోర్లలో నీరు సరిగా రాకపోవడంతో సమస్యలు ఎదుర్కొంటూ రోజూ కొంతమేర మాత్రమే పంట సాగు చేసేవారు. ప్రస్తుతం కురిసిన అధిక వర్షా నికి వరి పంట సాగు చేసే రైతులకు ఉపయోగకరంగా మారింది. ఆరుతడి పంటలు సాగు చేసే రైతులకు కూడా భూమి పూర్తి స్థాయిలో పదునైందని భూమి అరగానే దుక్కిలు చేపట్టి విత్తనం వేసే ఏర్పాట్లు చేయొచ్చని రైతులు పేర్కొంటున్నారు. మైదుకూరు మండల వ్యాప్తంగా కూడా శనివారం రాత్రి అధిక వర్షం చోటు చేసుకున్నది. రోడ్ల వెంట ఎక్కడ చూసినా వర్షపు నీరే పోర్లి ప్రవహిస్తూ ఉంది. మైదుకూరు పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున రోడ్లు పూర్తిగా నీటితో నిండిపోయాయి. దీనితో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కాలువలు, వంకలలో నీటి ప్రవాహం ప్రారంభమైంది.

భారీ వర్షంతో రైతుల్లో ఆశలు

పులివెందుల టౌన్ : శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం ఖరీఫ్ సీజన్ పం టల సాగులో రైతుల్లో ఆశను నింపింది. తీవ్ర వర్షాభావంతో పంటలు ఎండు దశకు చేరుకుంటున్న తరుణంలో ఈ వర్షం ఊరటనిచ్చింది. వేరుశనగ, పత్తి పంటలు సాగులో ఉన్నాయి. విత్తు విత్తినప్పటి నుంచి వర్షాలు లేక పంటలు దెబ్బతింటున్నానే ఆందోళనలో రైతులు కొట్టు మిట్టాడారు. ఈ నేపథ్యంలో భారీ వర్షం పడడం వారిలో ఆనందాన్ని తెచ్చింది.

కరువు గోడు పట్టని సిఎం : టిడిపి

ప్రజాశక్తి - వేంపల్లె

వర్షాల్లేక పంటలు ఎండి అవస్థలుపడుతున్న రైతుల గోడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పట్టడంలేదని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి తెలిపారు. స్థానికంగా ఆదివారం ఆయన విలే కరులతో మాట్లాడుతూ వర్ధంతులు, పుట్టిన రోజులకు ముఖ్యమంత్రి జగన్ రెడ్డి రావడం, పోవడం తప్ప జిల్లాలోని రైతుల పరిస్థితిపై అధికారులతో సమీక్షించకపోవడం విచారకరమన్నారు. జగన్ చేపట్టే ఇడుపులపాయ యాత్ర వల్ల ప్రజా ధనం దుర్వినియోగం తప్ప, ప్రజలకు ఒరిగే దేమీలేదన్నారు. వర్షాభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాం డ్ చేశారు. విత్తనాలు వంద శాతం సబ్సిడీతో రైతులకు పంపిణీ చేయాలని కోరారు. 2018లో చంద్రబాబు సిఎంగా ఉన్నప్పుడు ఇలాగే కరువు ఛాయలు నెలకొంటే ప్రివెంట్ ఆఫ్ సోయింగ్ కింద ప్రతి రైతుకు ఎకరాకు రూ.8,500 ఇచ్చారని గుర్తు చేశారు. వర్షాభావంతో 25 శాతం విస్తరణలోనే పంటలు సాగయ్యాయని తెలిపారు. తక్షణమే కడప జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించడంతోపాటు పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో మైనార్టీ నాయకుడు నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, జిల్లా ఉపాధ్యక్షుడు రామగంగిరెడ్డి, ఆర్‌వి రమేష్, తెలంగాణ వలి, మహమ్మద్, గోగుల మల్లికార్జున, వేమిరెడ్డి బాలకృష్ణారెడ్డి, రామకృష్ణారెడ్డి, డక్కా రమేష్, పాములూరు చంటి, డివి సుబ్బారెడ్డి, మల్లంగి పాపిరెడ్డి, పిపి చెంద్రాయుడు, పోతిరెడ్డి శివ, మడకా శ్రీనివాసులు, నామ వేమా కుమార్, గోగుల మారుతి, నందిపల్లి శ్రీరామరెడ్డి, మాబు షరీఫ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

పైప్‌లైన్ పగిలి మంచినీరు వృథా

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పార్లపల్లె బృ హత్తర మంచినీటి పథకం నుంచి వస్తున్న పైపులైన్ పగిలిపోవడంతో మం చినీరు వృథాగా పోతోంది. మండలంలోని ప్రజలకు ఫ్లోరైడ్ రహిత మంచినీటిని అందించాలనే లక్ష్యంతో దాదాపు 20ఏళ్ల క్రితం స్కీంను ప్రారంభించారు. అయితే ఇటీవల కాలంలో పైపులైన్ తరచూ మర మ్మతులకు గురవుతూ నీరు లీక అవుతోంది. మం డలంలోని బిదినంచర్ల సమీపంలో పైపులైను లీకేజీ కావడంతో నీరు వృథాగా పోతోంది. ఈ నీరు ప్రవహించడంతో రోడ్డు దెబ్బతింటోందని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి వెంటనే పైపులైన్‌కు మరమ్మత్తు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

6, 8న ప్రత్యేక సదరం క్యాంప్

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఈనెల 6, 8 తేదీల్లో ప్రత్యేక సదరం క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రంగ స్వామి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక సదరం క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన వారు తమ వికలత్వానికి సంబంధించి సర్టిఫికెట్, ఆధార్, రేషన్ కార్డులతో సిహెచ్‌సిలో సంప్రదించాలని కమిషనర్ సూచించారు. శిబిరంలో వైద్యులు పరిశీలించి అర్హులైన వారికి పింఛన్ వచ్చేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వధూవరులకు టిడిపి నేతల ఆశీర్వాదం

ప్రజాశక్తి - ఖాజీపేట

టిడిపి మండల కన్వీనర్ తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి కుమారుడు పవన్‌కు మార్‌రెడ్డి వివాహ కార్యక్రమానికి ఆదివారం మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ హాజరై వధూవరులను ఆశీర్వ దిం చారు. స్థానిక ఆంజనేయ కొట్టాలు సమీపంలోని జివి కళ్యాణ మండపంలో జరిగిన వివాహ కార్య క్రమానికి టిడిపి నాయ కులు పుత్తా నరసిం హారెడ్డి, సురేష్ నాయుడు హాజరయ్యారు. కడప మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ సందుల నాగశివారెడ్డి, పత్తూరు ఉప సర్పంచు ముత్తూరు రమణ, పుల్లయ్య నాయుడు, రామానాయుడు, జెండాల మహబూబ్ బాషా పాల్గొన్నారు.

నేటి నుంచి మెయిన్ బజార్‌లో పనులు

ప్రజాశక్తి- పులివెందుల రూరల్

పులివెందుల పురపాలక సంఘంలోని మెయిన్ బజార్‌లో సెంట్రల్ బోలె వార్డు పనులు సోమవారం నుంచి పనులు చేయనున్నారు. ఆ మేరకు ట్రాఫిక్‌కు సంబంధించి మున్సిపల్ కమిషనర్ ట్రాఫిక్ ఎస్ఐ హాజీవలితో కలిసి మెయిన్ రోడ్‌ను ఆదివారం పరిశీలించారు. మెయిన్ రోడ్డులో ఇప్పటి వరకు వస్తున్న వాహనాలు సోమవారం నుంచి పడమటి వైపు రోడ్డున వెళ్లేలా చేశారు. అక్కడ వన్ వే చేయనున్నారు.శ్రీరామ హాల్ రోడ్డు వెడల్పు చేయు పనులు జరుగుతున్నందున ఆ రోడ్డున రాకపోకలకు సంబంధించి బస్సులను తాత్కాలికంగా రింగ్ రోడ్డులో వెళ్లేలా చేసేందుకు సంబంధించి కూడా పరి శీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

సిమెంట్ దారి లేక.. రాకపోకలు సాగించలేక..!

ఖాజీపేట : అభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్లాది రూపా యల నిధులను ఖర్చు చేస్తున్నా.. క్షేత్ర స్థాయిలో సత్ఫలి తాన్ని వ్వడంలేదనే విమ ర్శలు న్నాయి. రాకపోకలు సాగించేందుకు సౌకర్యంగా సిమెంట్ రోడ్లు ఏర్పాట్లు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. స్థానిక మండల కార్యాలయాల సముదాయం ఎదురు వీధి శ్రీనివాస్ నగర్‌కు సిమెంట్ దారి లేకపోవడంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం వస్తే మట్టి రోడ్డు బురదమయంగా తయారవుతోందని, నడవడానికి వీల్లేకుండా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను గతంలో పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా చర్యలు లేవని వాపోతున్నారు. ఏడాదిన్నర కాలంగా సిమెంట్ దారి ఏర్పాటు చేయాలని కోరుతున్నామని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని పేర్కొం టున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

పేదలకుచీరల పంపిణీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక జయమ్మ కాలనీ(బాకారాపురం) సమీపంలో ఉన్న షాలోమ్ ప్రార్థన మందిరం నిర్వాహకులు మందిరంలో ఆదివారం చీరల పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వల్లెపు వరప్రసాద్‌చే పం పిణీ చేయించారు. అనం తరం చైర్మన్ మాట్లా డుతూ ఆ కరుణా మయుడు చెప్పి నట్లుగా నిన్ను వలె నీ పొరుగు వాని ప్రేమించు అన్నట్లుగా చర్చివారు చీరల పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. పాస్టర్ కృపరాజు ప్రత్యేకంగా చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్ కిషోర్, రాజశేఖర్ కోసం ప్రార్థన చేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

చక్రాయపేట : గండి వీరాంజనేయ స్వామి ఆలయంలో శాశ్వత అన్నదాన పథకానికి కడప నగరం మోడంపల్లె వాస్తవ్యులు దేవగుడి శ్యామ్‌సుందర్‌రెడ్డి, వారి ధర్మపత్ని పద్మజ రూ.1,01,116 విరాళం ఇచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. ఆలయ అర్చకులు కేసరి స్వామి, రాజస్వాములు అంజన్న సన్నిధిలో వారి కుటుంబ సభ్యుల పేరిట పూజలు చేశారు. అనంతరం ఆంజనేయ స్వామి చిత్రపటాన్ని అందజేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పెద్దముడియం : మండల పరిధిలోని పెద్దపసుపుల గ్రామంలో ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో 1993-94 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. కార్య క్రమంలో ఉపాధ్యాయ వృత్తికి ప్రతిష్ఠలు తెచ్చిన డాక్టర్ సర్వేపల్లి రాధా కృష్ణ సేవలను స్మరిం చుకుంటూ, వారికి విద్యను నేర్పిన ఉపాధ్యా యులను సన్మానిం చారు. కార్యక్రమంలో బాల్యంలో ని జ్ఞాపకాలను, అనుభవాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం చిన్నపిల్లలతో నృత్య కార్యక్రమాలను ఏర్పాటు చేసి, బహుమతులను అందజేశారు.

క్రీడా నైపుణ్యాన్ని విద్యార్థుల్లో పెంచాలి

ప్రజాశక్తి-వేంపల్లె

క్రీడా నైపు ణ్యాన్ని విద్యార్థుల్లో పెం పొందించాలని జడ్‌పి టిసి రవికుమార్‌రెడ్డి కోరారు. స్థానిక తల్లిశెట్టి సుబ్ర మణ్యం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆడుదాం ఆంధ్ర అనే టోర్నమెంట్‌పై విద్యా ర్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్‌పిటిసి మాట్లా డుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించేందుకు ముందడుగు వేయాలని సూచించారు. క్రీడల్లో రాణించి మండలానికి మంచి గుర్తింపు తేవాల న్నారు. ఆ మేరకు ఎలాంటి సహాయం కావాలన్నా అందిం చేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఆడుదాం ఆంధ్ర టోర్నమెంట్‌లో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో క్రీడల ఇన్‌ఛార్జి రాజశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ గురుప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖద్వారానికి వెండి వితరణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పట్టణంలోని శ్రీ అంకాలమ్మ ఆలయంలో గర్భగుడి ముఖద్వారానికి సంబంధించి వెండి తోరణం ఏర్పాటుకు 1.5 కిలో వెండిని ఆదివారం వితరణ చేశారు. పట్టణానికి చెందిన వెంకట్ నారాయణరెడ్డి, గంగాదేవి దంపతుల కుమారుడు పల్లేటి అశోక్‌కుమార్‌రెడ్డి, ప్రసూన దంపతులు, మన వడు వెంకట అక్షిత్ సాయి రెడ్డి అంకాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వ హించి, వెండిని ఆలయ చైర్మన్ నాగేంద్రప్రసాద్‌కు అందజేశారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని దాతలు పేర్కొన్నారు. అనంతరం వారిని ఆలయ చైర్మన్ శాలువాతో సత్కరించారు. దాత సోదరుడు అరుణ్‌కుమార్‌రెడ్డి, లావణ్య దంపతులను, చిన్నారులు అహ్నిజ, ఆకాంక్షలను అర్చకులు ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సురేష్, ఆలయ కమిటీ సభ్యులు నాగ భూషణం, బాబురెడ్డి, మోహన్, రాముడు, వరలక్ష్మి, సుశీలమ్మ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పూల భాస్కర్

బిజెపి జిమ్మిక్కులను ప్రజలు విశ్వసించరు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎన్నికల ముందు బిజెపి పాల్పడుతున్న జిమ్మిక్కులను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని కాంగ్రెస్ పార్టీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి పూలభాస్కర్ అన్నారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల ముందు బిజెపి గ్యాస్ ధర రూ.200 తగ్గించి ప్రజల చేత మెప్పు పొందాలని చూస్తోందని అన్నారు. కానీ ఆ పార్టీ మళ్ళీ అధికారంలోకి వస్తే గ్యాస్ రూ.200 వేల వరకు పెరుగుతుందని, ఈ విషయం ప్రజలు గమనిస్తూనే వున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ గ్యాస్ ధర రూ.500 ఇస్తామని ప్రకటించిన నేపథ్యంలోనే బిజెపికి మింగుడు పడక ఈ నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఇటీవల మణిపూర్‌లో జరిగిన హింసాత్మక సంఘటనలపై స్పందించకుండా బిజెపి నిరంకుశ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కర్ణాటక ఎన్నికలలో బుద్ధి చెప్పిన విధంగానే రాష్ట్ర, దేశ ప్రజలు బిజెపిని కూకటి వేళ్ళతో సహా తొలగిం చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు సన్నీ, నాయకులు పూల జనార్దన్, హరికృష్ణ యాదవ్ పాల్గొన్నారు.


జనసేన పార్టీలో చేరిన కార్యకర్తలతో ఇన్‌ఛార్జి దినేష్

జనసేనలో పలువురి చేరిక

ప్రజాశక్తి-పీలేరు

నియోజకవర్గంలో రోజు రోజుకూ జనసేన పార్టీకి జనాదరణ లభిస్తోందని నియోజకవర్గ ఇన్‌ఛార్జి దినేష్ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని బోడుమల్లువారిపల్లి పంచాయతీ, మొరవపల్లిలోని ఓ కల్యాణ మండపంలో జనసేన పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కెవిపల్లి మండలానికి చెందిన వైసిపి నాయకులు బి. రెడ్డెప్ప, అతని అనచరులు సుమారు 50 మందితో కలసి జనసేనలో చేరారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు రానున్న ఎన్నికల్లో మార్పు కోరుకుంటున్నారని, పవన్ కల్యాణ్ నిర్వహించే ప్రతి కార్యక్రమానికి జనం బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన పార్టీ విజయం తథ్యమని అన్నారు. సమావేశంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రవి, కెవిపల్లి మండల అధ్యక్షులు మహేష్, పీలేరు మండల అధ్యక్షులు మోహన్, పవన్, గజేంద్ర, హరీష్, గంగాధర్, పవన్, కిశోర్ సమక్షంలో కొత్తగా వచ్చిన వారికి జనసేన పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

7న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక శ్రీవారీనగర్‌లో రుక్మిణి,సత్యభామ సమేత శ్రీకృష్ణ పరమా త్ముని ఆలయంలో ఈనెల 7న జరుగబోవు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల కరప త్రాలని ఆదివారం ఆలయ ప్రాంగణంలో విడుదల చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ రాయలసీమలోనే అతిపెద్ద దేవాలయంగా ప్రసిద్ధి చెందిన కృష్ణ దేవాలయం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఉదయం 5 గంటలకు అభిషేకాలు, 9 గంటలకు కల్యా ణోత్స వం, మూడు గంటలకు వసం తోత్సవం, ఐదు గంటలకు స్వామివారి ఊరే గింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కల్యాణోత్సవంలో పాల్గొనాలనే ఆసక్తి ఉన్న వారు రూ.1016 చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ వేడుకల్లో పట్టణ ప్రజలు, భక్తాదులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

వాసవి క్లబ్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-పీలేరు

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలు అభినందనీయమని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ పాలకుర్తి గాయత్రి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక నెహ్రూ బజారులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అనంతరం ఆమె పట్టణంలోని మదనపల్లె రోడ్డులో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శ్రీవిద్యా గణపతి, వాగ్దేవి పూజా మందిరాన్ని ప్రారం భించారు. స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో ఆవరణంలో రోగులు కూర్చో డానికి సౌకర్యంగా ఏర్పాటుచేసిన రెండు సిమెంట్ బల్లలను , అంకాళమ్మ ఆలయానికి వచ్చే భక్తుల కోసం సమకూర్చిన వాటర్ ప్యూరిఫైర్‌ను ప్రారం భించారు. నిరుపేద ఆర్యవైశ్యులకు ఆర్థికసాయం, శ్రీ విద్యా గణపతి వాగ్దేవి పూజా మందిర నిర్మాణమునకు సహకరించిన దాతలకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఇసి ఆఫీసర్స్ రాచపల్లి బాలాజీ, కృష్ణమూర్తి, డిస్టిక్ గవర్నర్ వెంకటేష్‌బాబు, వైస్ గవర్నర్ సురేష్ బాబు, సెక్రటరీ ప్రభాకర్, ట్రెజరర్ శివప్రసాద్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పామిడి నాగరాజు, జోన్ చైర్ పర్సన్ పామిడి జయచంద్ర, డిపిఒ ప్రభాకర్, వాసవి క్లబ్ గ్రేటర్ ప్రెసిడెంట్ అరవింద్, సెక్రెటరీ కొత్త మాసి గోవర్ధన్, ట్రెజరర్ ఆమూరి శివఫణేష్, వాసవి కపుల్స్ ప్రెసిడెంట్ ఆమూరి మహేందర్, బొగ్గారపు వెంకట సురేష్, ట్రెజరర్ ఆమూరి శంకర్, కపుల్స్ చార్టెడ్ ప్రెసిడెంట్ గందే నరసింహులు, సభ్యులు మెతుకు మురళి, పచ్చు రవి, కొత్త కృష్ణమూర్తి, అమరాసత్య పాల్గొన్నారు.

బయపురెడ్డి మృతి టిడిపికి తీరనిలోటు

ప్రజాశక్తి-ఖాజీపేట

మండలంలోని చెముళ్లపల్లెకు చెందిన రెడ్డి చిన్న బయపురెడ్డి (84) మృతి టిడిపికి తీరనిలోటని ఆపార్టీ సీనియర్ నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బయపురెడ్డి పార్టీ ఆవిర్భావం 1983 నుంచి జీవితాంతం టిడిపిలోనే కొనసాగారని గుర్తు చేశారు. నీతి, నిజాయితీ, నిబద్ధతతో పనిచేశారని పేర్కొన్నారు. ఆదివారం బయపురెడ్డి మృతదేహం వద్ద రెడ్యం సోదరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

డ్వాక్రా లీడర్‌పై లైంగిక వేధింపులు

ఆపై హత్యాయత్నం : కేసునమోదు

ప్రజాశక్తి-రామసముద్రం

సంవత్సర కాలంగా ఫోన్ సంభాషణ ద్వారా డ్వాక్రా లీడరుపై లైంగికంగా వేదిస్తూ హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని మూగవాడి పంచాయతీ ఎద్దనపల్లి గ్రామంలో నివాసమున్న వెంకటరమణ భార్య సరస్వతి గత కొన్నేళ్లుగా డ్వాక్రా లీడర్‌గా పనిచేస్తున్నారని తెలిపారు. స్థానిక ఎం.కొత్తూరు గ్రామానికి చెందిన శ్రీరాములు కుమారుడు గంగరాజు అనే వ్యక్తి గతంలో ఆమె ఫోన్ నంబర్‌ను సేకరించి తరచుగా ఫోన్ చేస్తూ అసభ్యంగా ప్రవర్తించేవారని తెలిపారు. ఫోన్ ద్వారా అసభ్యంగా ప్రవర్తించినా విషయాన్ని ఎవరికి చెప్పకుండా ఆమె గోప్యంగా ఉంచినట్లు పేర్కొన్నారు. శనివారం సాయం త్రం 7 గంటల సమయంలో ఆమె భర్త వెంకటరమణకు గంగరాజు ఫోన్ చేసి మీ భార్య తన దగ్గర డబ్బులు తీసుకుందని, ఆ డబ్బులు తిరిగి చెల్లించాలని అడగటంతో ఇద్దరి మధ్య వాగ్వివాదం జరిగిందన్నారు. అనంతరం బాధిత మహిళ ఇంటి వద్దకు గంగరాజు చేరుకొని అతని వెంట తెచ్చుకున్న కత్తితో ఆమె చేతిపై, అడ్డొచ్చిన ఆమె కొడుకుపై దాడి చేసి గాయపరిచారని తెలిపారు. ఈ ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.